

# విహ్వల

ఓబిలగుంట రామచంద్రమూర్తి

సాయంత్రం ఆరు దాటింది

రివ్వుమని వీస్తున్న చలిగాలిని చీకటి కిరణాలు కౌగిలించుకుంటున్నాయి. రోడ్డుమీద జనసంచారం ఎక్కువగా లేదు.

ఆమె వడివడిగా నడుస్తోంది వుండి వుండి అనుమానంగా వెనక్కి తిరిగి చూస్తోంది

కొంచెందూరంలో వాళ్ళిద్దరూ తనను అనుసరిస్తూనే వున్నారు వాళ్లు మాట్లాడుకుంటున్న మాటలు తనకు వినిపిస్తూనే వున్నాయి.

"కొంచెం వేగంగా నడవరా! నీకంటే ఆడపిల్ల నయం! ఆ అమ్మాయి ఎంత గబగబా నడుస్తోందో చూడు!"— ఒకడు రెండోవాణ్ణి తొందరపెడుతున్నాడు.

"ఏమిటావ్ లే! నేను నడవలేక కాదు!..
కానీ నాకు ఇష్టంలేదు!"

"దద్దమ్మలా మాట్లాడకు! మగా
డన్నాక తెగింపు కావాలి!"

మళ్లీ ఆమె వెనక్కి తిరిగి వాళ్ళను
చూసింది.. ఆ మందెచీకట్లో వాళ్ళ
ముఖాలు స్పష్టంగా కనిపించటంలేదు

"ఇలా ఎంతదూరంరా వెళ్లేది?....
ఇంక వెనక్కిపోదాం!" ఒకడంటున్నాడు.

"ఇంతవరకూ వచ్చి వెనక్కి వెళ్ళటం
ఏమిట్రా పూల్?.... చూడు.... అప్పు
డప్పుడు ఆ అమ్మాయి మన వైపు
చూస్తోంది!.... వ్యవహారం ఏమిటో
పూర్తిగా తేల్చుకుందాం!"- ఉత్సాహంగా
అన్నాడు రెండోవాడు.

దూరంగా ఆకాశంలోంచి ఉండి ఉండి
మెరుపుతీగలు నేలరాలుతున్నాయి....
అంతకు ముందు రెండు రోజుల్నించీ
వర్షం కురిసినందువల్ల రోడ్డంతా ఇంకా
చెమ్మగానే వుంది.... పరికిణీ కుచ్చిళ్ళు
కొంచెం ఎత్తిపట్టుకుని- జాగ్రత్తగా
నడుస్తోంది ఆ అమ్మాయి.... అయినా
ఆ నడక వేగంగానే వుంది.

ఆమె మలుపు తిరిగి బస్టాండులోకి
వచ్చింది.

అక్కడ జనం పల్చగా ఉన్నారు....
ఓ బస్సు కదలటానికి సిద్ధంగా వుంది.

'సూర్యాపేట, నార్కెట్‌పల్లి, హైద
రాబాద్'- అంటూ క్లీనరు కుర్రాడు
కాటోలు అరుస్తున్నాడు బస్సుముందు
నిలబడి.

"బస్సులో వెళ్ళిపోతుంది కాటోలు"-
నిరాశగా నిట్టూర్చేడు ఒకడు, ఆమెను
గమనిస్తూ.

"ఎక్కడికెడుతుందో?"- తనలో తనే
అనుకున్నట్టుగా అన్నాడు మరొకడు.

ఆమె గబగబా టిక్కెట్లిచ్చే 'బుకింగ్'
దగ్గరకు నడిచింది.... భుజాన వేలాడు
తున్న హేండ్‌బ్యాగ్‌లోంచి డబ్బు తీసి-
అక్కడున్న కండక్టరు దగ్గర టికెట్
కొనుక్కుంది.... మళ్లీ బస్సుదగ్గిర
కొచ్చింది....

'మార్యాపేట, నార్కెట్‌పల్లి, హైద
రాబాద్!'- అంటూ క్లీనరుకుర్రాడు
ఉత్సాహంగా అరుస్తున్నాడు.

"ఈ బస్సు 'కోదాడ' వెళ్ళేసరికి
ఎంతవుతుంది!"- ఆమె అడిగింది
అడిగింది ఆ క్లీనరుకుర్రాణ్ణి....

ఓ క్షణం ఆలోచించి చెప్పేడు వాడు-

"పదవుతుందేమోనమ్మా!"

ఆమె సాలోచనగా తల పంకించి-
బస్సెక్కేసింది.... అలా ఎక్కేటప్పుడు
మరోసారి వెనక్కి చూసి, వాళ్ళిద్దరిమీదా
ఓ చిరునవ్వు విసిరింది....

ఆ చూపుకీ, అందులోని చిర్నవ్వుకీ
వాళ్ళిద్దరూ కరిగిపోయేరు.

"వెరీగుడ్.... మన పంట పండింది!"
హుషారుగా అన్నాడొకడు.... రెండో
వాడు అర్థంకానట్టు చూసేడు.

"నీ జేబుల్లో డబ్బెంత వుందో
బయటకు తియ్!" — మళ్ళీ అన్నాడు
వాడు.

"ఎందుకురా ?"

"చెప్తానుగా ముందు తియ్‌!"

రెండోవాడు తన జేబులోంచి ఓ పది రూపాయల కాగితం, మరికొంత చిల్లరా తీసి -

"ఇదిగో! మొత్తం పదీ ఎనభై!-" అంటూ వాడిచేతిలో పెట్టాడు.

"వెరీగుడ్! నా దగ్గర అయిదు రూపాయలు ఉన్నాయి మొత్తం పదిహేను ఎనభై. మనిద్దరం 'కోహెడ' వెడుతున్నాం! ఒక్కొక్క టిక్కెట్టు మహా వుంటే అర్రూపాయలుంటుంది!" - అంటూనే బుకింగ్‌వైపు నడిచేడతను.

"కోదాడ ఎందుకురా ఇప్పుడు ?"

"ఎందుకేమిటి నీ మొహం! నువ్ విన్లేదూ ? ఆ పిల్ల కోహెడ వెడుతోంది!"

"వెడితే!"

"అదే చెబుతున్నా! కోదాడ చిన్న వూరు! కానీ బస్సు ఊళ్లోకి వెళ్ళదు." రోడ్డుమీద దిగి చాలా దూరం నడిచి వెళ్ళాలి. బస్సు అక్కడికి వెళ్ళేసరికి రాత్రి పదవుతుందట! అంత రాత్రివేళ ఆ పిల్ల ఒక్కత్తే అలా అడవిలాంటి ప్రదేశంలో దిగి - అంతదూరం నడిచి వెడుతుంది!" -

"అందుకని మనమూ ఆ పిల్లకి సాయం వెళ్ళాలంటావ్ ?!" సహనాన్ని కోల్పోతూ అడిగేడు రెండోవాడు.

"వెడితే తప్పేమిటి ? పిట్ట వలలో పడాలేగాని - అంతకంటే మనకేం కావాలి ?" ఆశగా అన్నాడు వాడు.

"ఏడ్చినట్టేవుంది! కథ బెడిసికొట్టిందంటే చచ్చినంత పని అవుతుంది. అసలే చలిగాలి దంచేస్తోంది. రాత్రికి తిరిగి రావాలంటే మనకు బస్సు దొరుకుతుందో లేదో ? పైగా వున్న డబ్బంతా వెళ్లటానికే సరిపోతుంది!" - అంటూ ఇంకా ఏదో చెప్పబోతుండగానే - బస్సు కదలబోతున్న సూచనగా హారన్ వినిపించింది.

ఒక్క క్షణంలో బుకింగ్ దగ్గరకెళ్ళి 'కోహెడ'కి రెండు టిక్కెట్లు తీసుకుని బస్సువైపు పరుగెత్తాడు మొదటివాడు. రెండోవాడు కూడా అతన్ని అనుసరించేడు.

కదుల్తున్న బస్‌లోకి ఇద్దరూ చొరబడ్డారు. అదృష్టంకొద్దీ లోపల చాలా సీట్లే ఖాళీగా వున్నాయి. ఆ అమ్మాయి కూర్చున్న సీటుకి ఎదురుగా వాళ్ళిద్దరూ చతికిలబడ్డారు.

బస్సు వేగాన్ని అందుకుంది చలిగాలి రొద చేస్తూ లోపలకు ప్రవేశిస్తోంది.

తన హేండ్‌బ్యాగ్ లోంచి సిల్కు రుమాలు తీసి, తలమీదుగా, చెవులచుట్టూ కట్టుకుంది ఆ అమ్మాయి.

ఆమెవైపు అప్పుడే పరిశీలనగా చూడగలిగేరు వాళ్ళు.

విశాలమైన నేత్రాలతో - గులాబీ రేకులవంటి పెదవులతో ఆమె వదనం

పున్నమి చందమామలా వెలిగిపోతూంటే వచ్చీరాని వయసు ఆమె వంటిమీద పరవళ్ళు తొక్కుతోంది

"చాలా అందంగా వుంది! . కదూ!" నెమ్మదిగా అడిగేడు ఒకడు.

"అవును! దేవకన్యలా వుంది!" రెండోవాడు చెప్పేడు.

ఆమె వాళ్ళిద్దరివైపూ చూసి చిన్నగా నవ్వింది. మళ్లీ అంతలోనే చూపులు మరల్చుకుని - కిటికీలోంచి బయటకు చూడసాగింది.

ఉధృతంగా వీస్తున్న గాలికి ఆమె పైట అల్లరిపెడుతూ, వాళ్ళిద్దర్నీ వెర్రెక్కిస్తోంది.

"ఇంక గంటలో బస్సు కోహెడ చేరుకుంటుంది. అక్కడ ఆమె బస్సు దిగితే - ఊళ్ళోకి బోలెడు దూరం నడవాలి ఈలోగా ఆ చీకట్లో ఎవరూ లేకుండా తామిద్దరూ ఆమెను " వాళ్ళిద్దర్లోనూ దాదాపు అలాంటి ఆలోచ నలే ఉవ్వెత్తున వీస్తున్నాయి.

మరి కాసేపటికి బస్సు ఆగింది

"కోహెడ త్వరగా దిగాలి... కోహెడ!" - బస్ కండక్టర్ అరిచేడు.

అంతవరకూ అంతూదరీ లేకుండా సాగిన వాళ్ళిద్దరి ఆలోచనలూ విరిచి పోయాయి.

అంత చలిలోనూ శరీరంపై చిరు చెమటలు పడుతూంటే గుండె దడదడ లాడుతూంటే - వాళ్ళిద్దరూ చటుక్కున లేచి క్రిందకు దిగేరు దిగేముందు ఆమె వైపు ఒకసారి చూసేరు

సీటుపక్కన ఉన్న తన హేండ్ బ్యాగ్‌ను తీసుకుంది ఆ అమ్మాయి.

కండక్టర్ 'రైట్' అన్నాడు.

"అయ్యో బస్ కదిలిపోతోంది! త్వరగా దిగండి!" కిందనుంచి అరిచేడు అతను, ఆమెను చూస్తూ.

"మీ బ్యాగ్ ఇలా కిటికీలోంచి నాకు అందించి మీరలా దిగిపోండి!"- రెండో వాడు ఉచిత సలహా ఇచ్చేడు.

కానీ ఆమె కదల్లేదు

తన హేండ్‌బ్యాగ్‌ని ఒళ్ళో పెట్టుకుని చిన్నగా నవ్వుతూ అంది -

"సారీ నే నింకా చాలా దూరం వెళ్ళాలి! మాది హైదరాబాద్!. . వస్తాను!" —

బస్సు మళ్ళీ వేగాన్ని అందుకుంది. తల ఇవతల పెట్టి ఆమె, చేయి ఊపు తూనే వుంది.

వెర్రిమొహాలు వేసుకుని వాళ్ళిద్దరూ అలా చూస్తూ నిలబడిపోయారు ఆ చలిలో